వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



బాపట్ల అర్బన్ : కొండుబోట్ల పాలెంలో శ్రీ వెంకటేశ్వరస్వామి, వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ సముదాయంలో జీవ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కురుక్షేత్రంలో మయూర ధ్వజుని త్యాగానికి ప్రతిరూపమే ఆలయ ధ్వజస్తంభం అన్నారు.

వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ.. ముగిసిన మొదటి దశ



కొల్లూరు : వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి దశ పోటీలు శనివారంతో ముగిశాయి. కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలల క్రీడామైదానంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ ఆధ్వర్యంలో టోర్నీ జరుగుతున్నాయి. నాకౌట్ పద్ధతిలో తొలి రౌండ్‌లో 48 మ్యాచ్‌లు నిర్వహించగా 48 జట్లు గెలుపొంది రెండో దశకు అర్హత అర్హత సాధించాయి. మేరుగ చందన్ నాగ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ షీల్డ్‌లను అందజేశారు. మ్యాచ్‌ల నిర్వహణను గరిక రమేష్, పాలిమేర నవీన్‌రెడ్డి, సాయి, రవికిరణ్, జాషువ, సునీల్, గంగాధర్, రవితేజ, మనోజ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

ఆహార సాంకేతిక విద్యకు ఉజ్వల భవిష్యత్తు



బాపట్ల: ఆహార సాంకేతిక విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టరు సాంబశివరావు పేర్కొన్నారు. బాపట్లలోని డాక్టరు ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. విద్యార్థుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయ, ఇంజినీరింగ్ కళాశాలల డీన్‌లు డాక్టరు శ్రీనివాసరావు, డాక్టరు మణి, ఇందుకూరి సీడ్స్ డెయిరీ ప్రొడక్షన్ సీఈఓ డాక్టర్ కిషోర్, అధ్యాపకులు సౌజన్య పాల్గొన్నారు.

ఐసీయూకు వెళ్లి.. వృద్ధాప్య పింఛను అందించి



నగరం: అల్లపర్రు గ్రామ సచివాలయ పరిధిలోని కట్టవ గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలి గుంటూరు జీజీహెచ్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ షేక్ అబ్దుల్లా శనివారం వైద్యశాలకు వెళ్లి మస్తాన్‌వలికి వృద్ధాప్య పింఛను నగదును అందజేశారు. మస్తాన్‌వలి కుటుంబ సభ్యులు అతనిని అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నిజాంపట్నం: గుణ్ణంతిప్ప గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం కారణంగా రొయ్యల కంపెనీ దగ్ధమైంది. బాధిత కుటుంబాలను శనివారం ఎంపీ మోపి దేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు పరామర్శించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి గోపీ, అర్జునరావుకు చెందిన రొయ్యల కంపెనీలు దగ్ధమయ్యాయని, వారికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. మండల కన్వీనర్ వీరంకి ముక్తేశ్వరరావు ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

బాపట్లటౌన్: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి తెలిపారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ముత్తాయపాలెం, పల్లిపాలెం గ్రామాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు ప్రతిరోజు గ్రామీణప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను వ్యవసాయ పనులకు తీసుకెళ్లే ఆటోడ్రైవర్లు కూలీలను పరిమితికి మించి ఎక్కించరాదని హెచ్చరించారు. రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో డ్రోన్ వినియోగంపై అవగాహన

పిట్టలవానిపాలెం/కర్లపాలెం: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలని బాపట్ల ఏడీఏ లక్ష్మి తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం, కర్లపాలెం మండలం దుండివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, కర్షక్ ఆగ్రో ఇండస్ట్రీస్ సంయుక్తంగా సాగులో డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ ద్వారా ఎరువు, పురుగు మందు పిచికారిపై అవగాహన కల్పించారు. ఏఓలు సత్యానంద్, సుమంత్, ఏఈఓ సుదర్శనరావు, వీఏఏలు గోపీ, బాజీ పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స..వైద్యులకు అభినందన

బాపట్ల: బాపట్ల ఏరియా వైద్యశాలలో వైద్యులు 16 సంవత్సరాల నుంచి కణితితో బాధపడుతున్న యువకుడికి శస్త్ర చికిత్స చేశారు. కణితిని తొలగించారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, వైద్యులు సుబ్రహ్మణ్యం, ప్రకాశ్, కృష్ణారావు బృందాన్ని మేధా కళాశాల యజమాన్యం, రెడ్‌క్రాస్ అభినందించింది. ఏరియా వైద్యశాల్లో వైద్యులను సన్మానించింది. కళాశాల యజమాని గొర్ల శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బీఎస్ నారాయణభట్లు, బీజేపీ నాయకులు జీవీఎల్‌మోహన్‌గౌడ్ ఉన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

నగరం: స్థానిక సీహెచ్‌సీ డాక్టర్ రత్నకుమారి ఆరోగ్యకేంద్రంలో శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ సుధాకర్, సీహెచ్‌వో బాబు రావు, ఏఎస్ఎం విమల పాల్గొన్నారు.